క్లుప్తంగా

ఔత్సాహిక క్రీడాకారులకు ఆహ్వానం

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా కేంద్రంలోని సర్దార్ పటేల్ స్టేడియంతో పాటు పెవిలియన్ గ్రౌండ్, సెయింట్ జోసేఫ్ హైస్కూళ్లలో వచ్చేనెల 1వ తేదీ నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తామని డీవైఎస్‌ఓ టి.సునీల్‌రెడ్డి తెలిపారు. ఈ శిబిరాల్లో పాల్గొనే ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఆయా వేదికల వద్ద కోచ్‌లను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, ఫుట్‌బాల్, రోలర్ స్కేటింగ్, ఉషూ, లాన్ టెన్నిస్, స్విమ్మింగ్, వెయిట్ లిఫ్టింగ్, ఆర్చరీ, టేబుల్ టెన్నిస్, కబడ్డీ, ఖో–ఖో, నెట్‌బాల్, హ్యాండ్‌బాల్, కరాటే అంశాల్లో శిక్షణ ఉంటుందని తెలిపారు.

ఇద్దరిని కుటుంబాలకు అప్పగించిన 'అన్నం'



బంధువులకు అప్పగిస్తున్న శ్రీనివాసరావు

ఖమ్మంఅర్బన్: మతిస్థిమితం కోల్పోయిన దారి తప్పిన ఇద్దరిని చేరదీసిన ఖమ్మంలోని అన్నం ఫౌండేషన్ బాధ్యులు వారు కోలుకున్నాక కుటుంబం చెంతకు చేర్చారు. వివరాలిలా ఉన్నాయి. 2019లో ఖమ్మం ప్రకాశ్‌నగర్ వద్ద ఒకరు, 2022లో కారేపల్లిలో ఇంకొకరు మతిస్థిమితం లేని వ్యక్తులు స్థానికులను ఇబ్బంది పెడుతుండగా పోలీసులు ఇచ్చిన సమాచారంతో అన్నం ఫౌండేషన్ బాధ్యులు చేరదీశారు. వీరికి ఆశ్రయం కల్పించి వైద్యం చేయించగా కోలుకున్నాక వివరాలు వెల్లడించారు. ఒకరు నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం ఆచనపల్లికి చెందిన అబ్దుల్ అజీమ్‌గా, మరొకరు నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం ఎత్తొండకు చెందిన ఆవాల శ్రీనివాస్‌గా తేలడంతో ఆదివారం అక్కడకు తీసుకెళ్లి పోలీసుల సమక్షాన కుటుంబీకులకు అప్పగించినట్లు అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మం అర్బన్: మమత విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ప్రత్యామ్నాయ లైన్ పనులు చేపడుతున్నందున సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏడీ యాదగిరి, ఏఈ లక్ష్మణ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని పాకబండ ఫీడర్, మైసమ్మ టెంపుల్ ఫీడర్, మధురనగర్, మమత ఫీడర్లలో విద్యుత్ నిలిపివేయనున్నట్లు అధికారులు తెలిపారు. మమత హాస్పిటల్ రోడ్, గొల్లగూడెం రోడ్, రాఘవయ్య నగర్, మధురనగర్, పువ్వాడనగర్ ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ఖానాపురం సబ్‌స్టేషన్ పరిధిలో డైరీ ఫీడర్ ద్వారా సరఫరా అవుతున్న వైరా రోడ్, ఇందిరానగర్, రోటరీనగర్ ప్రాంతాలకు కూడా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీ, ఏఈలు వెల్లడించారు.

కూసుమంచి: మండలంలోని పెరికసింగారం, మంగళితండా సబ్‌స్టేషన్ల పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ తావుర్యా ఆదివారం తెలిపారు. ఈ మేరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు మంగళితండా, భగవత్‌వీడు, ఈశ్వరమాధారం, రాజుపేట, తాళ్లగడ్డతండా, తుమ్మతండా, మద్దివారిగూడెం, బికారితండాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

నగరంలో సినిమాలు

తిరుమల	ఓదెలా 2
వినోద	జింఖానా, మ్యాడ్ స్క్వేర్
సాయిరాం	సారంగపాణి జాతకం
ఆదిత్య	అర్జున్ S/o వైజయంతి
శ్రీనివాస	సూర్యాపేట జంక్షన్, జాక్

– ఖమ్మం గాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	18	బచ్చలికూర	4
వంకాయ	20		20
బెండకాయ	20	పాలకూర	4
పచ్చిమిర్చి	34		20
కాకర	48	చుక్కకూర	4
బీర	46		20
దొండ	20	తోటకూర	4
పొట్లకాయ	40		20
చిక్కుడు	86	గోంగూర	4
గోరుచిక్కుడు	40		20
క్యాబేజీ	20	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	30		20
ఆలుగడ్డ	28	కొత్తిమీర	1
చామగడ్డ	40		30
క్యారెట్	36	పుదీన	1
క్యాప్సికం	60		20
బీట్‌రూట్	26	–ఖమ్మం వ్యవసాయం	

పొలాలే ప్లాట్లుగా..

పాలేరు నియోజకవర్గంలో అక్రమ వెంచర్ల ఏర్పాటు మూడు పువ్వులు.. ఆరు కాయలుగా విరాజిల్లుతోంది. నిబంధనలకు విరుద్ధంగా వెంచర్లు ఏర్పాట్లు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా పాలేరు నియోజకవర్గంలోని నేలకొండపల్లి, కూసుమంచి, తిరుమలాయపాలెం, ఖమ్మంరూరల్ మండలాల్లో వెంచర్లు పుట్టగొడుగుల్లా పుట్టకొస్తున్నాయి. గతంలో అధికారులు హెచ్చరికలు జారీ చేసినా బేఖాతరు చేస్తూ ప్లాట్లను అమ్మేస్తున్నారు. దీంతో ఆదాయపరంగా గ్రామ పంచాయతీ, ప్రభుత్వం నష్టపోతుండటమే కాకుండా భవిష్యత్‌లో కొనుగోలుదారులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం లేకపోలేదు. – నేలకొండపల్లి



తిరుమలాపురం వద్ద కొత్త వెంచర్‌లో హెచ్చరిక ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన పంచాయతీ అధికారులు

అక్రమ వెంచర్లు.. అడ్డగోలుగా అమ్మకాలు

- నిబంధనలు పాటించని రియల్టర్లు
- హెచ్చరిక బోర్డులు బేఖాతర్
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- పట్టించుకోని అధికారులు

ప్లాట్లుగా మారుతున్న పంట పొలాలు..

పాలేరు నియోజకవర్గంలో పచ్చటి పంట పొలాలు ప్లాట్లుగా మారుతున్నాయి. అయినా అధికార యంత్రాంగం తమకేమి పట్టనట్లు వ్యవహరించడంతో అక్రమార్కులకు పెట్రేగిపోతున్నారు. దర్జాగా వెంచర్లను ఏర్పాటు చేసి విక్రయాలు చేపడుతున్నారు. ఇటీవల మండలంలోని నేలకొండపల్లి, సింగారెడ్డిపాలెం, కొత్తకొత్తూరు, తిరుమలాపురం, పైనంపల్లి గ్రామాల్లో నిబంధనలు ఉల్లంఘించి ప్లాట్లను ఏర్పాటు చేశారు. అధికారులకు తెలిసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఖమ్మం రూరల్, కూసుమంచి, నేలకొండపల్లి మండలాలలో రియల్టర్లు ఎక్కడా నిబంధనలు పాటించడం లేదని స్థానికులు ఫిర్యాదులు కూడా చేశారు. అందులో నేలకొండపల్లికి చెందిన పలువురు సామాజిక కార్యకర్తలు వెంచర్లపై జిల్లా కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. పట్టణంలోని ఓ వెంచర్‌పై కోర్టును కూడా ఆశ్రయించేందుకు చర్యలు చేపట్టారు. పైనంపల్లి సమీపంలోని పంట పొలాల భూమిని చదును చేసి ఇతరత్రా అవసరాల కోసం అని వెంచర్‌గా మార్చారు.

నింబంధనలకు పాతర..

వెంచర్‌గా ఏర్పాటు చేయాలంటే నిబంధనలు కచ్చితంగా పాటించాల్సిందే. మొదటగా వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చుకుని, లేఔట్ రూపొందించి డీటీసీపీ ప్రణాళికకు అనుగుణంగా రహదారులు ఏర్పాటు చేయాలి. సామాజిక అవసరాలకు అవసరమైన భూమిని కేటాయించాలి. వీటి మూలంగా గ్రామ పంచాయతీతో పాటు ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది. కానీ ఇవేమి పట్టించుకోకపోవడంతో ప్రభుత్వం, పంచాయతీలు ఆదాయపరంగా నష్టపోతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు అందని ప్రస్తుత తరుణంలో వివిధ మార్గాల ద్వారా నిధుల సమీకరణకు కృషి చేయాల్సిన అవసరం ఉంది. నిధులు లేక కనీసం సిబ్బందికి వేతనాలు ఇవ్వలేకపోతున్న దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అనుమతి తప్పనిసరి..



వెంచర్ల నిర్వాహకులు అనుమతి పొందాకే పనులు ప్రారంభించాలి. పంట పొలాలను ప్లాట్లు మార్చాలంటే నిబంధనలు కచ్చితంగా పాటించాల్సిందే. ఎక్కడైనా వెంచర్లు ఏర్పాటు చేస్తే తమకు సమాచారం అందించాలి.

– వి.వెంకటేశ్వర్లు, తహసీల్దార్

చర్యలు తీసుకుంటాం..



మండలంలో కొత్త వెంచర్ల ఏర్పాటుకు సమాచారం అందించాలని సూచించాం. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడితే సహించేది లేదు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహించొద్దని పంచాయతీ కార్యదర్శులు ఆదేశించాం.

– సీహెచ్.శివ, ఎంపీఓ

పంట పొలాలను కాపాడాలి..



రియల్టర్లు పంట పొలాలను వెంచర్లుగా మార్చకుండా కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. పొలాలను ప్లాట్లుగా చేసి వ్యవసాయాన్ని దెబ్బతీస్తున్నారు. అధికారులు వ్యవసాయ భూములకు అనుమతులు ఇవ్వకుండా చూడాలి.

– పొత్తీయ శ్రీనివాసరావు, రైతు సంఘం నేత, నేలకొండపల్లి

పన్నుల వసూళ్లపై నిర్లక్ష్యం..

- మూడు రోజుల్లో ముగియనున్న 'ఎర్లీబర్డ్'



సిబ్బంది లేక ఖాళీగా ఉన్న కార్యాలయంలోని పన్నుల వసూళ్ల కేంద్రం

ఖమ్మంమయూరిసెంటర్: పన్నుల చెల్లింపుదారులకు ప్రభుత్వం ప్రకటించిన 5 శాతం రాయితీ ఎర్లీబర్డ్ పథకం మూడు రోజుల్లో ముగియనుంది. ప్రభుత్వం ప్రకటించిన రాయితీని సద్వినియోగం చేసుకునేందుకు పన్ను చెల్లింపుదారులు ఆసక్తి చూపిస్తున్నారు. ఆదివారం పలువురు పన్నులు చెల్లించేందుకు కేఎంసీ కార్యాలయంకు రాగా కార్యాలయంలో పన్నులు కట్టించుకునే సిబ్బంది లేకపోవడంతో వెనుదిరిగారు. గతేడాది ఏప్రిల్ నెల చివరిలో సెలవు దినాల్లో కూడా కార్యాలయంలో అధికారులు పన్నులు కట్టించుకున్నారని, ఇప్పుడు పన్నులు చెల్లించేందుకు అధికారులు, సిబ్బంది కనిపించడం లేదని కార్యాలయంకు వచ్చిన వారు వాపోయారు.

ఉగ్రదాడిని నిరసిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ



ఖమ్మంఅర్బన్: ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు



ఖమ్మంరూరల్: సీపీఐ ఆధ్వర్యంలో..

ఖమ్మంరూరల్: పహల్గాం ఉగ్రదాడిని నిరసిస్తూ మండలంలోని వరంగల్‌క్రాస్‌రోడ్డులో సీపీఐ ఆధ్వర్యంలో ఆదివారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. నాయకులు దండి సురేష్, రాంకోటి, దండి రంగారావు, ఓరుగంటి శేషగిరిరావు, మిడకంటి చిన వెంకటరెడ్డి, చెరుకుపల్లి శేషగిరి, రాము తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంఅర్బన్: నగర కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తూ నగరంలో 9, 10, 11, 12, 13 వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుల ఆధ్వర్యంలో రోటరీ నగర్ నుండి ఇల్లందు క్రాస్ రోడ్డు వరకూ కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. కాంగ్రెస్ నగర అధ్యక్షులు మహమ్మద్ జావేద్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య మాట్లాడుతూ.. ఉగ్రదాడి బాధితులకు కేంద్ర ప్రభుత్వం అండగా ఉండి దాడికి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో 10, 9 డివిజన్ల కార్పొరేటర్లు చావా మాధురి నారాయణరావు నాగుల్ మీరా, 9, 11, 12, 13 డివిజన్ల అధ్యక్షులు దొడ్డ ప్రవీణ్, ఫరీద్ ఖాద్రి, దండా ప్రసాద్, ఏలూరు రవికుమార్, నాయకులు బాబా, భాష, సుగుణ, నాన్న బాల రామకృష్ణ, జాకీర్‌భాష, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సంఘం నాయకులు

ఖమ్మం సహకారనగర్: పెండింగ్‌లో ఉన్న సమస్యలను ప్రభుత్వం త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వ డ్రైవర్ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు వీజీకే మూర్తి, హౌస్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షుడు ఎండి.సలీం, జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు కోరారు. ఆదివారం సంఘం కార్యాలయంలో ఉమ్మడి జిల్లా సంఘం కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అనంతరం పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి మృతిచెందిన పర్యాటలకు, పద్మశ్రీ అవార్డు గ్రహిత వనజీవి రామయ్యకు నివాళులర్పించారు. తొలుత పలువురు డ్రైవర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సమావేశంలో నాయకులు వేణుగోపాల్, ఉస్మాన్ అలీ, గంగన్న, రాములు, శ్రీనివాసరెడ్డి, భద్రాద్రి జిల్లా కన్వీనర్ వనమా శ్రీనివాసరావు, కో కన్వీనర్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నివాళి

ఖమ్మంవ్యవసాయం/ రఘునాథపాలెం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు తండ్రి పిచ్చయ్య మృతి చెందగా పలువురు వీవీపాలెంలో ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రధానకార్యదర్శి మెంతుల శ్రీశైలం, ఉపాధ్యక్షుడు సోమా నరసింహారావు, సహాయ కార్యదర్శి మన్నెం కృష్ణ, కోశాధికారి తల్లాడ రమేష్, సెంట్రల్ ఈసీ సభ్యులు కైలాసపు వేణుగోపాల్, నాగేశ్వరరావు, దిరిశాల వెంకటేశ్వర్లు, ముత్యం ఉప్పల్‌రావు, జంగిలి రమణ, సోమారపు సుధీర్‌కుమార్, కల్యకుంట్ల గోపాల్‌రావు, మిర్చి శాఖ సభ్యులు పల్లపోతు వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, సోమిశెట్టి లక్ష్మీనారాయణ, బండారు వీరబాబు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్, కాంగ్రెస్ మండల కన్వీనర్ వాంకుడోత్ దీపక్, తమ్మిన్ని నాగేశ్వరరావు, కాపా ఆదినారాయణ, రమణ, యాదవ మహాసభ జిల్లా గౌరవ అధ్యక్షుడు మేకల మల్లిబాబు యాదవ్, అధ్యక్షుడు చిలకల వెంకట నరసయ్య, జిల్లా యాదవ యువజన అధ్యక్షుడు చిత్తారు సింహాద్రి యాదవ్, నాయకులు షేక్ ఫతే మహమ్మద్, తోట రామారావు, వాగదాని కోటేశ్వరరావు, రంగారావు, నాగేశ్వరరావు, కోటయ్య, మురళి, కిషోర్, పంకు అప్పారావు, నరసింహారావు, పరిటాల భద్రయ్య, వీరబాబు, భద్రం, లింగయ్య పాల్గొన్నారు.

అనర్హులకు ఇళ్లు ఇచ్చారని ఆందోళన

రఘునాథపాలెం: మండలంలోని పలు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు జాబితాల్లో అర్హులకు అన్యాయం చేస్తూ అనర్హులకు మంజూరు చేశారని ఆయా గ్రామాల్లో జాబితాలను చూసిన వారు అధికారులపై మండి పడుతున్నారు. మండలంలోని బూడిదంపాడులో 50 పైగా ఇళ్లు మంజూరయితే వాటిలో పక్కా ఇళ్లు ఇప్పటికే ఉన్న వారికి మళ్లీ ఇళ్లు మంజూరు చేశారని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదే తీరుగా అనేక గ్రామాల్లో అర్హుల పేర్ల కంటే అనర్హులకు పక్కా ఇండ్లు మంజూరి చేస్తూ జాబితాలు వచ్చాయని ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు విచారణ చేసి నిజమైన పేదలకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోండి

నేలకొండపల్లి: భూ భారతి రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలని తహసీల్దార్ వి.వెంకటేశ్వర్లు సూచించారు. ఆదివారం మండలంలోని రాజేశ్వరపురం, రామచంద్రాపురం గ్రామాల్లో జరిగిన సదస్సుకు పెద్ద ఎత్తున రైతులు హాజరై వివిధ సమస్యలపై దరఖాస్తులు అందించారు. తహసీల్దార్ తప్జల్ హుస్సేన్, డిప్యూటీ తహసీల్దార్ ఇమ్రాన్, ఆర్ఐలు ఆలస్యం మధుసూదన్‌రావు, రవి ఉన్నారు.

ముగిసిన జాతర



పూజలు చేస్తున్న దృశ్యం

నేలకొండపల్లి: మండలంలోని మోటాపురం గ్రామంలో మూడురోజుల నుంచి జరుగుతున్న శ్రీ వీరన్నస్వామి జాతర ఆదివారంతో ముగిసింది. ఈ నెల 25, 26, 27 వరకు దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో జాతర అంగరంగ వైభవంగా జరిగింది. వీరన్న స్వామి విగ్రహాన్ని గ్రామంలో భారీ ఎత్తున ప్రదర్శన నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ చావా కోటయ్య, ఏలూరి శ్రీనివాసరావు, రావెళ్ల కృష్ణారావు, చావా కిరణ్‌కుమార్, బెల్లం పుల్లయ్య, వెంకటేశ్వర్లు, బెల్లం వాసు, భాగం మురళి, ఇంటూరి అశోక్, కృష్ణమూర్తి, చావా హరి, అప్పారావు, నారాయణ, నాగేశ్వరరావు, మందుల లక్ష్మయ్య, ప్రవీణ్, హనుమంతరావు, ప్రభాకర్, రామారావు, వీరశేఖర్‌రావు తదితరులు ఉన్నారు.

భారత ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలి



మన్‌కీ బాత్ కార్యక్రమం వీక్షిస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిపై రాజకీయాలు, కులాలకు అతీతంగా భారతీయులంతా ఏకతాటిపై ఉండి భారత ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని బీజేపీ రాష్ట్ర నాయకులు, భూపాలపల్లి జిల్లా ఇన్‌చార్జి గల్లా సత్యనారాయణ కోరారు. ఈ మేరకు ఆదివారం ఖమ్మం టూ టౌన్ అధ్యక్షుడు వెంకటనారాయణ యాదవ్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని పార్టీ జిల్లా కార్యాలయ ప్రాంగణంలో నాయకులతో కలిసి వీక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గెంటేల విద్యాసాగర్, జిల్లా ఉపాధ్యక్షుడు మందా సరస్వతి, తాజత్ భద్రం, డీకొండ శ్యామ్, ఎల్లారావ్ గౌడ్, రుద్రగాని మాధవ్, ఆచంటి కోటేశ్వరరావు, మత్యుంజయరావు, శ్రీనివాస్ రెడ్డి, మధు, రజినీ రెడ్డి, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు



రఘునాథపాలెం: జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



కూసుమంచి: సభకు వెళ్తున్న నాయకులు

నేలకొండపల్లి: బీఆర్ఎస్ 25 ఏళ్ల ఆవిర్భావ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు మండల కేంద్రంలో పార్టీ మండలఅధ్యక్షుడు వున్నం బ్రహ్మయ్య పార్టీ పతాకావిష్కరణ చేశారు. అనంతరం వరంగల్ సభకు వెళ్లారు. జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ మరికంటి ధనలక్ష్మి, నాయకులు శ్రీనివాసరావు, నెల్లూరి లీలాప్రసాద్, మరికంటి రేణుబాబు, అనగాని నరసింహారావు, షేక్ హుస్సేన్, తన్నీరు సత్యనారాయణ, కమదన ప్రవీణ్, మాదాసు ఆదాం ఉన్నారు.

కామేపల్లి: మండలంలో బీఆర్ఎస్ పార్టీ జెండాలను ఎగరువేశారు. అనంతరం ల్కతుర్తిలో జరిగే రజతోత్సవ సభకు బీఆర్ఎస్ శ్రేణులు తరలివెళ్లారు.

రఘునాథపాలెం: మండలంలోని పలు గ్రామాల నుంచి బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ఆదివారం వరంగల్ ప్లీనరీ సభకు ఉత్సాహంగా తరలివెళ్లారు. మండల అధ్యక్షుడు అజ్మీర్ వీరునాయక్, మాజీ మండల వైస్ ఎంపీపీ గుత్తా రవి సమన్వయంతో వాహనాలలో భారీగా కార్యకర్తలు బయలుదేరారు. మంచుకొండ గ్రామంలో మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ భూక్య లక్ష్మణ్ నాయక్ ఆధ్వర్యంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు భూక్య రాము నాయక్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. చెన్నులింగం, శంకర్, తేజావత్ రమేష్, బాధవత్ లాలు, భిక్షం, మల్లయ్య, సైదులు, రవి, రామారావు, పిన్ని కోటేశ్వరరావు ఉన్నారు.

ఖమ్మంఅర్బన్‌లో.. నగరంలోని విలీన గ్రామాల డివిజన్ల పరిధిలోని బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. కార్పొరేటర్లు నాగండ్లకోటి, కూరాకుల వలరాజు, గొల్లపూడి హరికృష్ణ, రాంప్రసాద్, అశోక్, బాలాజీ, నరిసింహా, బన్ను, వెంకన్న తదితరులు ఉన్నారు.

కూసుమంచి: ఎల్కతుర్తిలో జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభకు మండలం నుండి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షులు వేముల వీరయ్య ఆధ్వర్యాన పార్టీ శ్రేణులు ఎల్కతుర్తి తరలివెళ్లారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కామేపల్లి: ఆత్మీయ సమ్మేళనంలో అప్పటి గురువులతో పూర్వ విద్యార్థులు

ఖమ్మంఅర్బన్: నేలకొండపల్లి ఎస్ఎస్‌సీ పాఠశాల పూర్వ విద్యార్థులు నగరంలోని మొగిలి పాపిరెడ్డి కన్వెన్షన్‌హాల్‌లో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పాత జ్ఞాపకాలు నెమరువేసుకుంటూ, బాల్యమిత్రులతో ఆనందంగా గడిపారు. శ్రీనివాస్, ఎన్వీ సత్యనారాయణ, ఎస్‌కె.జావీద్, రావెల్ల అరవింద్, హిమబిందు, రేహానా సుల్తానా తదితరులు ఉన్నారు.

కూసుమంచి: మండలకేంద్రంలోని జలగం వెంగళరావు జూనియర్ కళాశాలలో 2004–05 బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఆటపాటలతో సరదాగా గడిపి అప్పటి గురువులను సన్మానించారు.

కామేపల్లి: మండలంలోని ముచ్చర్ల–జాస్తిపల్లి హైస్కూల్‌లో 2001–06 బ్యాచ్ ఆరో తరగతి నుంచి పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ముచ్చర్లలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. అప్పటి గురువులు రాంబాబు, రాజశేఖర్, శ్రీనివాస్, రాధ, ప్రసాద్‌లను సన్మానించారు. ఆటపాటలతో సందడిగా గడిపారు. పూర్వ విద్యార్థులు గుండ్ల సతీష్, చల్లా తిరుమలరావు, నాగరాజు, వరికొల్లు పుష్ప, హరీష్ పాల్గొన్నారు.



కూసుమంచిలో..



ఖమ్మంఅర్బన్: సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

రోడ్లపైనే పార్కింగ్..

- పీఎస్ఆర్ రోడ్డులో తీవ్రంగా ట్రాఫిక్ సమస్య
- జామ్ అయితే గంటల తరబడి ఆగాల్సిందే



పీఎస్ఆర్ రోడ్డులో ట్రాఫిక్ సమస్య ఇలా..



రోడ్డుపైనే నిలిపిన వాహనాలు

ఖమ్మంక్రైం: నగరంలోని త్రీటౌన్ పరిధిలో గాంధీ చౌక్ తర్వాత ప్రధాన వ్యాపారి కూడలి అయిన పీఎస్ఆర్ రోడ్డులో (పొట్టి శ్రీరాముల రోడ్డు) నిత్యం ట్రాఫిక్ సమస్య ఉంటుంది. నగరం అంతా దినాదినాభివృద్ధి జరుగుతున్న ఈరోడ్డును మాత్రం వెడల్పు చేయాలనే ఆలోచన గురించి అధికారులు పట్టించుకోవటం మానేశారు. 60 ఏళ్ల క్రితం ఈ రోడ్డు ఏలా ఉందో ఇప్పుడు కూడా అదే రోడ్డు ఉండటంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా తయారైంది.

రోడ్లపైనే వాహనాల పార్కింగ్ ...

నగరంలోని ప్రధాన రహదారి అయిన పీఎస్ఆర్ రోడ్డు కాల్వొడ్డు నుంచి వ్యవసాయ మార్కెట్ వెళ్లటానికి ప్రధాన రహదారి ఈ రోడ్డు గుండానే మార్కెట్‌కు మిర్చి, పత్తి భారీగా వెళ్తుంటాయి. రోడ్డు వెడల్పు లేకపోవటంతో వ్యాపార కేంద్రాలకు వచ్చే వాహనదారులు తమ వాహనాలను పార్కింగ్ చేసుకోవటానికి స్థలం లేకపోవటంతో రోడ్లపైనే నిలిపివేయటంతో రోడ్డుపై ఎప్పటికప్పుడు ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోతున్నాయి. ఈ రోడ్డుపై ముఖ్యంగా వ్యవసాయానికి సంబంధించిన పనిముట్లు ఎక్కువగా లభిస్తుండటంతో పెద్ద ఎత్తున రైతులు వస్తుంటారు. ఈ మేరకు వారి వాహనాలు నిలిపే పరిస్థితి లేక కొనుగోలు చేసే దుకాణాల ముందే రోడ్డుపైన పార్కింగ్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో గుంటుమల్లన్న శివాలయం ముందు నుంచి హర్కార బావి సెంటర్ వరకు ఇరుకుగా ఉండటంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతూ ఉంది.

రాజకీయ ఒత్తిళ్లే కారణం...

వాస్తవానికి పీఎస్ఆర్ రోడ్డు ఎప్పుడో విస్తరించాల్సి ఉంది. రోడ్డు వెడల్పు చేస్తే తప్ప ట్రాఫిక్ సమస్య తీరే అవకాశం లేదని పలువురు అధికారులు చెప్పినా రాజకీయ ఒత్తిళ్లతో పనులు ముందుకు సాగడం లేదు. ఈ అంశంపై ట్రాఫిక్ పోలీస్ అధికారులను వివరణ కోరగా ఎన్నిసార్లు ట్రాఫిక్‌ను నియంత్రించినా పరిస్థితిలో మార్పు రావడం లేదని, రోడ్డు వెడల్పు చేస్తే తప్ప సమస్య తీరదని చెబుతున్నారు. ఈ మేరకు అధికారులు స్పందించి రోడ్డు వెడల్పు చేసి ట్రాఫిక్ సమస్య తీర్చాలని వాహనదారులు కోరుతున్నారు.